వాహనాల అక్రమ పార్కింగ్‌ను సహించం

- రోడ్లు, వైన్స్, హోటళ్ల ముందు పార్కింగ్ చేసే వారిపై కఠిన చర్యలు
- వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు



హస్తినాపురం: జాతీయ రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపైన, వైన్‌షాపులు, హోటళ్ల ముందు అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం వనస్థలిపురంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ విజయవాడ, నాగార్జున సాగర్ రహదారులపై ఎక్కడిపడితే అక్కడ తమ ఇష్టానుసారంగా వాహనాలను నిలుపుతున్నారని, అలాంటివారిపై చర్యలు తీసుకుంటామని, వాహనాలకు జరిమానాలు విధిస్తామని అన్నారు. విజయవాడ జాతీయ రహదారిపై రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని, ఎక్కడపడితే అక్కడ వాహనాలను యూటర్న్ చేయవద్దని ఆయన వాహనదారులకు సూచించారు. కొన్ని ప్రాంతాల్లో డివైడర్ల మధ్య నుంచి వెళ్తున్నారని, అలా వెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ విభాగం ఏర్పాటు చేసిన యూటర్న్‌ల వద్ద మాత్రమే వాహనాలను మళ్లించాలని, నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు తప్పవని ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. రహదారులపై ఉన్న హోటళ్లు, వ్యాపార సముదాయాలు , వైన్ షాపులు , బార్‌ల వద్ద విధిగా వాహనాల పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు జంబ్లింగ్ పద్ధతిలో డ్రంకన్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డ వారి వాహనాన్ని సీజ్ చేసి కోర్టులో హాజరు పరుస్తున్నామన్నారు.

షూటింగ్‌లో వనస్థలిపురం విద్యార్థినికి బంగారు పతకం



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలుసుకున్న క్రితి మిశ్రా

వనస్థలిపురం: ఆగ్రాలో ఇటీవల జరిగిన పదవ వరల్డ్ క్రాస్బో షూటింగ్ ఛాంపియన్ షిప్ -2023 పోటీలో వనస్థలిపురానికి చెందిన విద్యార్థిని క్రితి మిశ్రా బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా క్రితి మిశ్రా మంగళవారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఎమ్మెల్యే ఆమెను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పలు దేశాల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో విశేష ప్రతిభ ప్రదర్శించి క్రితి మిశ్రా బంగారు పతకం సాధించడం మన తెలంగాణ రాష్ట్రానికి గర్వించదగ్గ విషయమన్నారు. రాబోయే రోజుల్లో ఆమె సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రితి మిశ్రా తల్లిదండ్రులు సునీత, రాధేశ్యామ్, నాయకులు దూసరి మధుగౌడ్, రాజి రెడ్డి, విఠల్‌గౌడ్ పాల్గొన్నారు.

'డ్రంకెన్ డ్రైవ్'లో పట్టుబడ్డ 9 మందికి జైలు

సైదాబాద్: సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ తొమ్మిది మంది వాహనదారులకు న్యాయస్థానం జైలుశిక్ష విధించిందని ఇన్‌స్పెక్టర్ నరసింహ నాయక్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఠాణా పరిధిలో పలుచోట్ల నిర్వహించిన తనిఖీల్లో 15 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. పోలీసులు మంగళవారం వారిని నాంపల్లిలోని 9వ ఎంఎం కోర్టులో హాజరపర్చగా, ఏడుగురికి రూ.2100, ఎనిమిది మందికి రూ.3300 చొప్పున న్యాయస్థానం జరిమానా విధించింది. అంతేకాకుండా వారిలో ఒకరికి ఏడు రోజులు, తనిఖీల్లో మూడోసారి పట్టుబడ్డ ఒకరికి నాలుగు రోజులు, రెండోసారి పట్టుబడ్డ ఏడుగురికి రెండు రోజుల చొప్పున కోర్టు జైలు శిక్ష విధించిందని ఇన్‌స్పెక్టర్ నరసింహ నాయక్ తెలిపారు. రహదారులపై భద్రత కోసం ఎవరూ మద్యం తాగి వాహనాలను నడపవద్దని, అందరూ కచ్చితంగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఆయన సూచించారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుందాం

మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

మీర్‌పేట: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మీర్‌పేటలోని టీకేఆర్ కళాశాలలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని మీర్‌పేట మాజీ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ తీగల అనితారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పార్టీ అధికారంలో కొచ్చిన వంద రోజుల్లోనే అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ఎంపీ టికెట్ ఎవరికి కేటాయించినా కాంగ్రెస్ గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పని చేద్దామన్నారు. ఈ సమావేశంలో బేర బాలకిషన్, అరవింద్ కుమార్, సరికొండ పాండు, మల్లేశ్, మద్ది కరుణాకర్‌రెడ్డి, పల్లె పాండుగౌడ్, జెటావత్ రవినాయక్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ఎంపీ స్థానం కాంగ్రెస్‌దే..

మహేశ్వరం: చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకొని సోనియా గాంధీకి కానుకగా ఇస్తామని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు. మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్ మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు రంజిత్‌రెడ్డికి మద్దతుగా తాము కూడా కాంగ్రెస్‌లో చేరుతామని తీగలను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరలో జరిగే ఎంపీ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌కు భారీ ఆధిక్యం తీసుకోస్తామన్నారు. చేవెళ్ల ఎంపీ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించి సోనియా గాంధీకి కానుకగా ఇస్తామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలంగాణ ఇచ్చిన పార్టీకే పట్టం కడతారన్నారు. ఎంపీ రంజిత్ రెడ్డి పార్టీలోకి చేరడంతో కాంగ్రెస్ మరింత బలంగా తయారవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మద్ది కరుణాకర్‌రెడ్డి, పరిగి రాఘవేందర్‌రెడ్డి, బోద జైపాల్‌రెడ్డి, బొర్ర జగన్‌రెడ్డి, అంధ్యా నాయక్, వర్కల యాదగిరి గౌడ్, రాకేష్‌రెడ్డి, అరవింద్, బాలకిషన్, సదానంద్ గౌడ్ పలువురు పాల్గొన్నారు.

గొంతు కోసి వ్యక్తి దారుణ హత్య

- వివాహేతర సంబంధమే కారణం?
- పోలీసుల అదుపులో నిందితుడు



మల్లికార్జున్ (ఫైల్)

నాగోలు: గొంతు కోసి వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. వివాహేతర సంబంధమే ఇందుకు కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...నాగోలు బండ్లగూడ చెందిన దేరింగుల మల్లికార్జున్ అలియాస్ మర్డర్ మల్లేష్ (28) కారు డ్రైవర్. ఏడేళ్ల క్రితం ముస్లిం మహిళ శిరీన్ అలియాస్ సిరిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి లడ్డు, తేనె ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య పిల్లలతో పాటు తల్లి లలితతో కలిసి కొంత కాలం క్రితం జైపురికాలనీ సమీపంలోని ఈశ్వరిపురి వచ్చి ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటున్నారు. మంగళవారం ఉదయం జైపురి కాలనీకి చెందిన అర్జున్ మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై మల్లికార్జున్ వద్దకు వచ్చాడు. మాట్లాడేది ఉందని చెప్పి అతడిని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని తీసుకెళ్లారు.

అతిగా మద్యం తాగించి..

మార్గమధ్యలో జైపురికాలనీలోని ఓ వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసి నాగోలు మూసీ సమీపంలోని లక్ష్మీనర్సింహ కాలనీలోని నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లారు. అందరూ కలిసి మద్యం తాగారు. మల్లికార్జున్‌తో ఎక్కువ మోతాదులో మద్యం తాగించారు. అనంతరం అర్జున్ మరో వ్యక్తితో కలిసి మల్లికార్జున్‌ను కత్తితో పొత్తి కడుపులో పొడిచి పేగులు బయటకు తీసి, గొంతు కోసి దారుణంగా చంపేశాడు. సాయంత్రం సమయంలో మూసీ వైపు వెళ్లిన స్థానికులు మృతదేహాన్ని గమనించి నాగోలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులకు అక్కడ మద్యం సీసాలు దొరకడంతో ఎవరో మద్యం తాగించి హత్య చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. స్థానికుల ద్వారా హతుడు ఈశ్వరిపురి కాలనీలో ఉండే మల్లికార్జున్‌గా గుర్తించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మల్లికార్జున్ హత్యకు గురైన విషయం తెలిసి అతడి అతడి కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. హతుడి భార్య సిరి తన పిల్లలతో కలిసి ప్రస్తుతం పుట్టింట్లో ఉన్నట్టు తెలిసింది. మల్లికార్జున్ తల్లి లలిత ఫిర్యాదు మేరకు నాగోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదే కారణమా?

మల్లికార్జున్ స్థానికంగా నివాసం ఉండే స్నేహితుడి భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్టు స్థానికులు చెప్తున్నారని, అదే కారణంతో హత్య జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నామని పోలీసులు తెలిపారు. కాలనీలోని సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు జైపురికాలనీకి చెందిన అర్జున్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అతడిని వివిధ కోణాల్లో విచారణ చేస్తున్నట్టు తెలిసింది.

మల్లికార్జున్‌పై పలు కేసులు...

హత్యకు గురైన మల్లికార్జున్‌పై ఎల్‌బీనగర్‌తో పాటు వివిధ పోలీస్ స్టేషన్‌లో పలు కొట్లాట కేసులు ఉన్నట్లు సమాచారం. బస్తీలో ఏ గొడవ జరిగిన మల్లికార్జున్ ముందు ఉండేవాడని స్థానికులంటున్నారు.

'కోడ్' పక్కాగా అమలు

ఒక వైపు చెక్ పోస్టుల ఏర్పాటు • మరోవైపు ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్ల తొలగింపు



వాల్‌పోస్టర్లను తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

ఎల్‌బీనగర్: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. తక్షణమే రంగంలోకి దిగిన అధికారులు, సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు ఎక్కడికక్కడ ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన చర్యలపై కన్నేశాయి. ఎల్‌బీనగర్ సహాయ రిటర్నింగ్ అధికారి ముకుందరెడ్డి ఆదేశాలతో ఇతర ఎన్నికల అధికారులు వారి విధుల్లో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ ప్రచారాలు, ప్రభావితం చేసే నాయకుల విగ్రహాలపై దృష్టి సారించారు. రాజకీయ పార్టీ జెండాల దిమ్మెలకు, విగ్రహాలకు ముసుగులు వేయడంతో పాటు వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. పార్కుల గోడలు, షెల్టర్లు, బ్రిడ్జీలు, బస్టాండ్లు, డివైడర్లపై వివిధ పార్టీల జెండాలు, గుర్తులు, నినాదాలతో పెయింటింగ్ ఉంటే.. అవి కనపడకుండా రంగు వేస్తున్నారు. అనుమతులు లేకుండా పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. అంతే కాకుండా పోలీసులు నగదు మద్యం రవాణాపై దృష్టి సారించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని ప్రధాన కూడళ్లతో పాటు సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మద్యం షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 11, వంకాయ 23, బెండ 45, పచ్చి మిర్చి 55, కాకర 38, బీర 45, క్యాబేజీ 23, ఫ్రెంచి బీన్స్ 55, క్యారెట్ 19, దొండ 20-23, చిక్కుడు 50, గోకర 40, బీట్‌రూట్ 17. క్యాప్సికం 65, ఆలు 21, దోస 18, సొర 9, పొట్ల 15, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 45. బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీదే గెలుపు



ఎమ్మెల్యే వెంకట రమణా రెడ్డిని సన్మానిస్తున్న విశ్వనాథ్ గౌడ్

పహాడీషరీఫ్: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో బీజేపీదే గెలుపు అని రంగారెడ్డి జిల్లా బీజేవైఎం కార్యదర్శి ఈరంకి విశ్వనాథ్ గౌడ్ పేర్కొన్నారు. బడంగ్‌పేట్‌లో జరిగిన మహేశ్వరం నియోజకవర్గం విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి మంగళవారం ఆయన మామిడిపల్లి నుంచి కార్యకర్తలతో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణా రెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. అనంతరం విశ్వనాథ్ గౌడ్ మాట్లాడుతూ గడిచిన పదేళ్లల్లో దేశానికి సుస్థిర పాలన అందించిన మోడీకే ప్రజలు పట్టం గడుతారన్నారు. తెలంగాణలో కూడా మెజార్టీ సీట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

చల్లగా చూడు తల్లి.. మావురాల ఎల్లమ్మ



తుక్కుగూడ: చల్లగా చూడు తల్లి.. మావురాల ఎల్లమ్మ అంటూ రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వత్రాలు చేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, భక్తులు పాల్గొన్నారు.

కర్మకాండకు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

16 తులాల బంగారం, రూ. 2లక్షల నగదు అపహరణ

ఇబ్రహీంపట్నం రూరల్: కర్మఖాండకు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్లా చేశారు. ఇంటి తాళాలు పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా, పెద్ద అడిశర్లపల్లి గ్రామానికి చెందిన గంజి యాదగిరి ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో బొంగ్లూర్‌లోని రాఘవేంద్రహోమ్స్‌లో నివాసం ఉంటూ హాస్టల్స్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 7వ తేదీన గంజి యాదగిరి తల్లి సత్తమ్మ మృతి చెందడంతో పెద్ద కర్మ జరిపే నిమిత్తం 16వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. 18వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు ఇంటికి వచ్చి చూడగా మెయిన్‌డోర్ తాళం విరగొట్టి ఉండటం గమనించాడు. లోపలికి వెళ్లి చూసేసరికి బీరువా పగలగొట్టి ఉంది. బంగారు ఆభరణాలు సుమారు 16 తులాల వరకూ, రూ.2 లక్షలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు తెలిపాడు. యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడల్లోను విద్యార్థులు రాణించాలి



క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అంకమ్మరావు

దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని భాష్యం పాఠశాల జోనల్ అధికారి అంకమ్మరావు అన్నారు. భాష్యం లిటిల్ చాంప్స్ ఆర్‌కేపురం పాఠశాల విద్యార్థులు మంగళవారం జోనల్ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. త్రోబాల్, పరుగు పందెం పోటీలు నిర్వహించగా, త్రోబాల్‌లో భాష్యం విద్యార్థులు ప్రథమ బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా అంకమ్మరావు మాట్లాడుతూ, తమ పాఠశాల విద్యార్థులను చదువుతో పాటు అన్ని రంగాలల్లో తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. క్రీడా పోటీల విజేతలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పలు బ్రాంచ్‌ల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియమావళి అతిక్రమిస్తే చర్యలు

ఎంపీడీఓ శైలజ



గోడలపై రాతలను తుడిచివేయిస్తున్న ఎంపీడీఓ

మహేశ్వరం: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని మహేశ్వరం ఎంపీడీఓ పి. శైలజ అన్నారు. మంగళవారం అమీర్‌పేట్ గ్రామాన్ని సందర్శించి ఎన్నికల ప్రవర్తన నియమావళి కోడ్ అమలులోకి వచ్చినందుకు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఉండొద్దని, వాటిని వెంటనే తొలగించాలని సూచించారు. గోడలపై పార్టీల నినాదాలను తుడిచి వేయాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. రోడ్లపైన, ఇళ్ల మధ్యన చెత్తాచెదారం ఉండకుండా శుభ్రం చేయించాలని కోరారు. అంతకు ముందు పలు వార్డుల్లో సందర్శించి ఎన్నికల కోడ్ నియమావళి గురించి వివిధ పార్టీల నాయకులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చక్రధర్‌గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

'మల్లు' ఆశయ సాధనకు కృషి

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దుబ్బాక రాంచందర్



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కందుకూరు: మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దుబ్బాక రాంచందర్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం వర్ధంతిని పురస్కరించుకుని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ, భూమి కోసం, భుక్తి కోసం, బానిసల విముక్తి కోసం బాల్యంలోనే తుపాకీ చేతబట్టి గెరిల్లా పోరాటం చేసిన మహనీయురాలు మల్లు స్వరాజ్యమని కొనియాడారు. పేద సంక్షేమానికి ఆమె చేసిన సేవ మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్‌చందు, ఎ.కుమార్, శేఖర్, రమణి, సుజాత పాల్గొన్నారు.

రాగన్నగూడలో..

తుర్కయంజాల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు కృషిచేస్తామని సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు డి.కిషన్ అన్నారు. మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా మంగళవారం రాగన్నగూడలోని పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కారత్, పార్టీ నాయకులు సత్యనారాయణ, భాస్కర్, శంకరయ్య, ఆశీర్వాదం, యాదగిరి, విజయ్, యాదయ్య, వెంకటకృష్ణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో...

ఇబ్రహీంపట్నం: మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కామ్రేడ్ మల్లు స్వరాజ్యం వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మల్లు స్వరాజ్యం పేదలకు చేసిన సేవలు చీరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శంకర్, బుగ్గ రాములు, నర్సింహ, గణేశ్, జగన్, శ్రీకాంత్, షఫీ ఉన్నిసా, స్వప్న, దశరథ, యాదగిరి, గణేశ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న సీఐ సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సీఐ సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. రాయపోల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్ని పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారో తెలుసుకొని..ఏలాంటి భద్రతా చర్యలు చేపట్టాలో ఆయన పరిశీలించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ఓటర్లు సహకరించాలని కోరారు. ఎస్ఐ మారయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులు కల్పించాలి

ఉప్పల్: ఎన్నికల ఏర్పాట్లకు అధికారులు సన్నద్ధం కావాలని ఏఆర్వో అభిషేక్ అగస్త్యా ఐఏఎస్ సూచించారు. ఉప్పల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. అధికారులంతా విధిగా ప్రతి పోలింగ్ స్టేషన్‌ను సందర్శించడంతో పాటు అక్కడి వసతులను పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా ర్యాంపుల ఏర్పాట్లను తనిఖీ చేయాలన్నారు. మంచినీరు, విద్యుత్, టాయిలెట్స్ లాంటివి ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. గత ఎలక్షన్‌లో ఎదురైన సవాళ్లను ఈసారి సవరించుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో 45 మంది సెక్టార్ అధికారులు, 12 మంది నోడల్ అధికారులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై 9440813109కు ఫిర్యాదు చేయండి

దిల్‌సుఖ్‌నగర్: కొత్తపేట సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు ఏదైనా సమస్య వస్తే నేరుగా ఫోన్ నం.9440813109కు ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చని ఏఈ అనీష తెలిపారు. అలాగే.. ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ సరూర్‌నగర్ 9490153567కు కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. హుడాకాంప్లెక్స్, హుడాకాలనీ, త్యాగరాయినగర్, బాపూనగర్, కమలానగర్, నేతాజీనగర్, గడ్డిఅన్నారం మున్సిపల్ ఆఫీస్, రెడ్డిబ్రదర్స్, శారదానగర్, పోచమ్మబాగ్, చెరుకుతోటకాలనీ, వెంకటేశ్వర కాలనీ, వివేకానందనగర్ (వీవీ నగర్) సరస్వతీనగర్, శ్రీనగర్‌కాలనీ, సిండికేట్ బ్యాంక్ కాలనీ, నర్సింహ్మపురి కాలనీ, ఎల్‌బీ నగర్ మున్సిపల్ ఆఫీస్, ఎమ్మార్వో ఆఫీస్ పరిసర ప్రాంతాల వారు ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేస్తే 24 గంటల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్-2 ఆర్‌టీసీ డిపో నుంచి నడిచే బస్ సర్వీసులకు సంబంధించి ప్రయాణికుల నుంచి సలహాలు, సమస్యలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు బుధవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్యలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఉద్గిర్, బీద్‌కుండ్, జుకల్, కొల్హాపూర్, విజయవాడ, బైలడిల్లా, జగదల్‌పూర్, బెంగళూరు, తొర్రూర్ వెళ్లే బస్సుల ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు నం. 9959226249కు ఫోన్ చేసి డీఎంతో నేరుగా మాట్లాడి సూచనలు, ఫిర్యాదులు చేయవచ్చని పేర్కొన్నారు.

24న జ్ఞానదీప్ టవర్స్ అసోసియేషన్ ఎన్నిక

మలక్‌పేట: మూసారంబాగ్ జ్ఞానదీప్ టవర్స్ ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 24న జరుగుతాయని అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జగన్నాథ్ రెడ్డి తెలిపారు. పోటీ చేసే ప్లాట్ యాజమానుల నుంచి ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించామని, అపార్ట్‌మెంట్ ఆవరణంలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. ఎన్నికల అధికారులుగా బి.హరినాథ్‌రావు, భూషణం వ్యవహరిస్తారన్నారు. సభ్యులంతా సకాలంలో హాజరై ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

24న పిచ్చుక గూళ్లు, నీళ్ల తొట్టెల పంపిణీ

ఎల్‌బీనగర్: ఎండ కాలంలో మూగ జీవుల దాహార్తిని తీర్చేందుకు కాలనీల్లో నీటి తొట్టెలతో పాటు పిచ్చుక గూళ్లు, వాటి ఆహారం కోసం కొర్రలు, సజ్జలు, రాగులు తదితర గింజలను ఈ నెల 24న పంపిణీ చేస్తామని జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్, పర్యావరణ వేత్త సూర్యకుమారి, గద్దె విజయ్‌నేత మంగళవారం తెలిపారు. మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవం , 24న సెలవు దినం కావడంతో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయత్రీనగర్ కాలనీలోని విప్ర సేవా సమితి పక్కన గల స్కూల్ వద్ద పిచ్చుక గూళ్లు, నీటి తొట్టెలను పంపిణీ చేస్తామన్నారు. ఆయా కాలనీల ప్రజలు వచ్చి పిచ్చుకగూళ్లు, ఆహార తొట్టెలను తీసుకోవచ్చన్నారు. తీసుకున్న వారు కాలనీలో ఏర్పాటు చేసి ప్రతి రోజూ పక్షులకు నీళ్లు, ఆహారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చల్లా నర్సింహారెడ్డికి అభినందనలు



నర్సింహారెడ్డిని సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిడెడ్ చైర్మన్‌గా నియమితులైన రంగారెడ్డిజిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిని మంగళవారం రామకృష్ణా పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు తలాటి రమేష్ నేత, బండి గోపాల్ రావ్, సంగం రమేష్, మదన్ మోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ

మలక్‌పేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్, సలీంనగర్ ఎన్నికల ప్రక్రియ ఈనెల 29 నుంచి 31 తేదీ వరకు కొనసాగుతుందని అసోసియేషన్ సెక్రటరీ జనరల్ ఎస్. వినయ్ కుమార్ తెలిపారు. బైలాస్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని కార్యవర్గం తీర్మానించి కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ జీవీ హన్మంతరావును ఎన్నికల అధికారిగా నియమించిందన్నారు. 29న సలీంనగర్‌లోని కార్యాలయంలో ఉదయం 10 నుంచి 2 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 3 నుంచి 4 గంటల వరకు పరిశీలన, 30 తేదీన నామినేషన్ల ఉపసంహరణ, ఎన్నిక ఏగ్రీవం అయితే అదే రోజు ఫలితాలు ప్రకటన ఉంటుందన్నారు. పోటీ ఉంటే 31న ఉదయ 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చైతన్యపురి సాయినగర్ సీనియర్ సిటిజన్స్ సేవా సమితిలో ఎన్నికలు జరుగుతాయన్నారు. సభ్యులందరూ అధిక సంఖ్యలో పాల్గొలని ఆయన విజ్ఞప్తి చేశారు.